క్లుప్తంగా

నేడు పైడిమాంబ అంబలం పూజ


ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేటలో జరగనున్న పైడిమాంబ అమ్మవారి వేడుకలను పురస్కరించుకుని 28వ తేదీ మంగళవారం సాయంత్రం పైడిమాంబ అంబలం పూజ ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు పెంటకోట నరేష్, దాడి అనిల్, పిళ్లా సాయి తెలిపారు. వేడుకల్లో భాగంగా భక్తిగీతాల ఆలాపన ఉంటుందన్నారు. భవానీ మాలధారులు, స్థానికులు ఈ పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ


కుట్టు మిషన్ల పంపిణీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు రామారావు, స్టాలిన్

గాజువాక: సీఎల్‌సీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ చైర్మన్ మహంతి ఆధ్వర్యంలో శ్రీనగర్‌లోని సీఎల్‌సీ మినిస్ట్రీస్ భవంతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్‌ల చేతుల మీదుగా మహిళలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సీఎల్‌సీ చైర్మన్ మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలన్న ఉద్దేశంతో కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ సేవలు భేష్


విద్యార్థులకు ప్రోత్సాహకం అందజేస్తున్న సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు త్రిఫ్ట్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సీఎండీ అతుల్ భట్ అన్నారు. త్రిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో స్టీల్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 2020 – 21, 2021 – 22 సంవత్సరాల్లో విద్యలో ప్రతిభ చూపిన 83 మంది విద్యార్థులకు రూ.2.48 లక్షల చెక్కులు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో పోటీ పెరిగి మరింత ఉజ్వల స్థితికి చేరుకుంటారన్నారు. సొసైటీ కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పిల్లలు విద్యలో ప్రతిభ చూపి మరింత రాణించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్లు కె.శ్రీనివాస్, బి.లాలూ, జి.వి.రమేష్, వి.జి.మహీదర్, సీనియర్ మేనేజర్ కె.దామోదర్‌రెడ్డి, స్టీల్ సిటు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్య.. మళ్లీ మొదటికి


మహాలక్ష్మి థియేటర్ నో పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచిన లారీలు

మల్కాపురం : ఆయిల్ లారీల డ్రైవర్లకు ఎన్నిసార్లు చెప్పినా మళ్లీ అదే రీతిలో వ్యవహరిస్తున్నారు. వీరి వ్యవహారంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. మల్కాపురం వద్ద గల ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌కు రోజూ వందల సంఖ్యలో ఆయిల్ లారీలు వస్తుంటాయి. అక్కడి నుండి భారీగా లోడ్ తీసుకుని వెళ్తుంటాయి. ఇలా వచ్చే లారీలకు ఆ సంస్థ తగినంత పార్కింగ్ సదుపాయం కల్పించాల్సి ఉంది. కానీ సంస్థ కల్పించిన పార్కింగ్ సదుపాయం చాలక డ్రైవర్లు లారీలను సేవామార్గాలపై ఇష్టమొచ్చినట్లు పార్కింగ్ చేస్తున్నారు. ఆ లారీలను వారు మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ వద్ద, ఐవోసీ మార్గంలోను, నేవల్ చిల్డ్రన్ స్కూల్ వద్ద రోజుల తరబడి వదిలేయటంతో ఇటువైపు వచ్చే పాదచారులు, వాహనచోదకులు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై 'సాక్షి'లో గత నెల 'సేవా మార్గంలో అనధికార పార్కింగ్'పేరిట వార్త ప్రచురణ జరిగింది. దీనిపై స్పందించిన ట్రాఫిక్ పోలీసులు మహాలక్ష్మి థియేటర్ వద్ద, నేవల్ చిల్డ్రన్ స్కూల్ వద్ద సేవా మార్గాలపై నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరైనా ఇక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తే జరిమానాలు తప్పవు అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినా ఆయిల్ లారీల డ్రైవర్లలో మార్పు రాలేదు. సోమవారం ఉదయం ఆయా ప్రాంతాల్లో తమ లారీలను పార్కింగ్ చేశారు. ఈ సమస్యపై ట్రాఫిక్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికుల వితరణ


బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు అందిస్తున్న తోటి పారిశుధ్య కార్మికులు

గోపాలపట్నం: పారిశుధ్య కార్మికులు దాతృత్వం చాటుకున్నారు. జీవీఎంసీ 92వ వార్డు లక్ష్మీనగర్‌లో నివాసముంటున్న తోటి పారిశుధ్య కార్మికురాలు ధనాల ఎర్నిమ్మ కుటుంబానికి నిత్యావసర సరకులు అందించారు. మూడు రోజుల క్రితం ఎర్నిమ్మ పూరిల్లు దగ్ధమయింది. దీంతో ఇంట్లో వస్తువులన్నీ కాలి బూడిదై ఎర్నిమ్మ కుటుంబం ఆసరా కోల్పోయింది. 92వ వార్డు పారిశుధ్య కార్మికులు స్పందించి సరకులు, కాయగూరలు, కొంత మొత్తం ఆర్థిక సాయం అందించారు. దీంతో ఎర్నిమ్మ సంతోషం వ్యక్తం చేసింది. అవుట్ సోరింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు, సత్యనారాయణ, పారిశుధ్య కార్మికురాలు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం


అర్జీలు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ రాజు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 5 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ సూపరింటెండెంట్ టి.ఎస్.ఎస్.రాజు స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్‌కు 1, ఇంజినీరింగ్‌కు 3 చొప్పున అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ప్రజా వినతులను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం ఆయా విభాగాధికారులకు వినతిపత్రాలను అందజేశారు.

సుధాకర్ గెలుపునకు కృషి చేయాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు

గోపాలపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని రాష్ట్ర విద్యా, మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ చైర్మన్ మళ్ల విజయప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతమ్మధార క్యాంప్ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గం నాయకుల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పట్టభద్రుని కలవాలని తొలి ప్రాధాన్యత ఓటు వేయించేలా కార్యకర్తలంతా కృషి చేయాలని కోరారు. ఇందుకోసం అందరూ సైనికుల్లా పని చేయాలన్నారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, ముద్రు వాణి, కొణతాల సుధ, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్రీనాథ్‌కు పలువురి అభినందనలు


బద్రీనాథ్‌ను అభినందిస్తున్న నాయకులు

మల్కాపురం : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు కలిదిండి బద్రీనాథ్‌ను వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల పార్టీ అధిష్టానం నియమించటంతో ఆయనను పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు పార్టీ నాయకులు అభినందించారు. 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీ వద్ద గల బద్రీనాథ్ నివాసం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి పీలా అనంత్‌కుమార్, రవి, అనుదీప్ తదితరులు వెళ్లి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు వరహాలు, చికెన్ రాజు, నర్సింగ్‌రావు, శంకరరావు తదితరులు బద్రీనాథ్‌ను అభినందించిన వారిలో ఉన్నారు.

సైన్స్‌పై అవగాహన తప్పనిసరి


విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రశాంతి

మల్కాపురం : సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలని డాక్టర్ ప్రశాంతి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల డిపార్టుమెంట్ ఆఫ్ మైక్రోబయాలజీ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సరస్వతీ విద్యా విహార్ పాఠశాల వద్ద పలు తరగతుల విద్యార్థులకు సైన్స్ ఉపయోగాలు, ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సైన్స్‌లో పలు అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ఆమె జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల శాశ్వత ఉపాధికి వినతి


స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామమోహనరావుకు వినతిపత్రం అందిస్తున్న వెంకటరమణారెడ్డి

పెదగంట్యాడ: ఉక్కు పరిశ్రమ నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఎ.మల్లికార్జున, స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.వి.వి.ఎస్.రామమోహనరావులను సోమవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం ఇళ్లు, భూములు కోల్పోయారని, అందులో కొంతమందికి ఉపాధి కల్పించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా ఉపాధి కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో చర్చలు జరిపి నిర్వాసితులకు న్యాయం చేయాలని విన్నవించారు.

డొంకాడలో కల్యాణ మండపం నిర్మించాలి

అగనంపూడి: అగనంపూడి పునరావాస కాలనీ సెక్టార్–1 డొంకాడలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కల్యాణ మండపం నిర్మించాలని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్‌ను అగనంపూడి కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రంలో కోరారు. ఉక్కు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం సీఎండీని కలిసిన నాయకులు అగనంపూడి పునరావాస కాలనీలో పన్నెండేళ్ల కిందట ఆధునిక వసతులతో ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. స్థల వివాదం వల్ల అప్పట్లో పనులు ప్రారంభించలేదని, 2014లో స్థల వివాదం పరిష్కారమైందని, యాజమాన్యం స్పందించి కల్యాణ మండపం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వాకింగ్ ట్రాక్ వద్ద హైమాస్ట్ దీపాలు వెలిగించాలని, బెంచీలు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న ఎస్‌డీసీ కార్యాలయ భవనాన్ని సేవా సంస్థలకు కేటాయించాలని నాయకులు బి.సత్యనారాయణ, కె.అప్పారావు, బి.అప్పారావు, సాంబశివరావు, సూర్యనారాయణ తదితరులు విన్నవించారు.

మూణ్నాళ్ల ముచ్చటే


గోపాలపట్నం రైతు బజారులో తుప్పపట్టిపోతున్న కటింగ్ మిషన్

- వర్మీ కంపోస్ట్ తయారీకి తిలోదకాలు
- గోపాలపట్నం రైతుబజార్‌లో మూలకు చేరిన పరికరాలు
- మళ్లీ మొదలుపెట్టాలంటున్న వినియోగదారులు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో కొన్నేళ్ల క్రితం వర్మీ కంపోస్ట్ తయారీని ప్రారంభించారు. అయితే ఇది ఆరంభ శూరత్వంలాగే మిగిలింది. ప్రారంభమైన కొత్తలో దీన్ని బాగా నిర్వహించారు. ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి వర్మీ కంపోస్ట్‌ను తయారు చేసేవారు. దానిని ప్యాకెట్ రూ.20 చొప్పు న విక్రయించారు. కాయగూరలు, ఆకు కూరల వంటివి చిన్నచిన్న ముక్కలుగా కోసేందుకు ప్రత్యేకంగా ఒక కటింగ్ యంత్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. కానీ తర్వాతి దశలో దీనిని అశ్రద్ధ చేయడంతో మంచి లక్ష్యం మరుగున పడిపోయింది. ఇక్కడ ఏర్పాటు చేసిన కటింగ్ మిషన్ తుప్పుపట్టిపోతోందని చూసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి మద్రిపాలెం రైతు బజారులోనూ ఉందని వినియోగదారులు వాపోతున్నారు. సుమారు ఆరేళ్ల క్రితం ప్రయోగాత్మకంగా జీవీఎంసీ ఇక్కడ వర్మీ కంపోస్ట్ ప్రారంభించింది. ఇది విజయవంతం కావడంతో మూడేళ్ల క్రితం ప్రత్యేకంగా కుండీలు, షెడ్లు నిర్మించారు. కొంత కాలం అయ్యాక దీన్ని పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ప్రస్తుతం ఈ కుండీల్లో చెత్త వేస్తున్నారు. సరైన రీతిలో దీనిని నిర్వహిస్తే తాము బయటి వ్యక్తుల వద్ద అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండదని.. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


గోపాలపట్నం రైతు బజారులో నిరుపయోగంగా పడి ఉన్న వర్మీ కంపోస్ట్ కుండీలు


మద్రిపాలెం రైతు బజార్ కుండీలదీ అదే పరిస్థితి

కేజీహెచ్‌లో గిరిజన మహిళకు దొరకని బెడ్


కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ వార్డులో నేల మీద పడుకున్న గిరిజన మహిళ


మంచం మీద తల్లిదండ్రులతో కృష్ణవేణి

- బెడ్ ఇచ్చామంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కేజీహెచ్‌లో గిరిజన మహిళకు బెడ్ కేటాయించలేదన్న అంశంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే ఆస్పత్రి పిల్లల వార్డులో గిరిజన పసికందు మృతి చెందడం, మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తరలించిన ఘటన మరిచిపోకముందే మరో గిరిజన మహిళకు బెడ్ ఇవ్వలేదని చెబుతున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంచంగి పుట్ మండలం వనగుమ్మ గ్రామానికి చెందిన కె.కృష్ణవేణిని తల్లిదండ్రులు ఈనెల 25న వైద్యం కోసం కేజీ హెచ్‌లో చేర్పించారు. దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ఆమె ఊపిరితిత్తుల్లో నీరు చేరింది. దీంతో 25న రాత్రి భావనగర్ వార్డులో చేర్పించి చికిత్స అందజేశారు. చికిత్సతో వ్యాధి తగ్గుముఖం పట్టడంతో కృష్ణవేణిని రాజేంద్రప్రసాద్ వార్డు 'డి' బ్లాక్ కు ఆదివారం తరలించారు. అక్కడ పడకలు ఖాళీ లేవు. మరో మహిళ ఉండే మంచాన్ని కృష్ణవేణికి కేటాయించారు. అంటే ఒకే మంచాన్ని ఇద్దరు ఉపయోగించాలన్న మాట. అయితే ఈ మంచం తీసుకోవడానికి కృష్ణవేణి నిరాకరించారు. అప్పటికే ఆ వార్డులో ఒక మహిళ చనిపోవడంతో కృష్ణవేణి అక్కడ ఉండడానికి నిరాకరించినట్లు బంధువులు తెలిపారు. అయితే కృష్ణవేణి ఆ వార్డులోనే కింద పడుకుని రాత్రి నిద్రించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తెల్లవారే సరికి జిల్లాలో వైద్యులు అప్రమత్తం అయ్యారు. అగమేఘాల మీద కృష్ణవేణికి మంచం కేటాయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, వార్డులో పడకలు ఖాళీ లేకపోయినా ఆమెకు మంచం ఇచ్చామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. రోగిని మంచం మీదకి మార్పు చేస్తున్న సమయంలో ఎవరో ఫొటో తీశారని, ఆమెకు మంచం నిరాకరించినట్టు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని సూపరింటెండెంట్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం


746వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 746వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన ఎం.ఎస్.ఎం, ఎస్.టీ.ఎం విభాగాల నాయకులు, కార్మికులు దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. కార్మికులు న్యాయం జరిగే వరకు దీక్షను విరమించేదిలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే కార్మికుల జీవితాలు సర్వనాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను కాపాడుకోవాలంటే ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

జోరుగా ఎన్నికల ప్రచారం


మాధవ్ తరఫున ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మల్కాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నిక వచ్చే నెల 12వ తేదీన జరగనున్న నేపథ్యంలో సోమవారం పలు పార్టీల నుండి పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచారం సాగిస్తున్నారు. దీనిలో భాగంగా 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను కలుసుకుని మాధవ్‌కు మొదటి ప్రాధాన్యత కల్పించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.ప్రకాష్, పంచదార్ల అప్పలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ అభ్యర్థి కె.రమాప్రభకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని మల్కాపురంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. లక్ష్మణమూర్తి, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కరాటే పోటీలు

కంచరపాలెం: కంచరపాలెం డీఎల్‌బీ కమ్యూనిటీ హాల్‌లో యంగ్ ఇండియన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు గొర్లె పుష్పారావు, మొల్లి తులసీరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ప్రథమ స్థానంలో వీవీవీ స్కూల్–స్టీల్ ప్లాంట్, రెండో స్థానంలో రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్–మధురవాడ నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో విజేతలకు ముఖ్య అతిథులు నేషనల్ పోర్ట్ ట్రస్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, ఉత్తరాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు నరవ రాంబాబు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. ఏప్రిల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు స్మార్ట్‌బోర్డు వితరణ


మాట్లాడుతున్న కార్పొరేటర్ లతీష్

అక్కిరెడ్డిపాలెం: డిజిటల్ ప్రపంచంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పాత్ర ఇండియా సహకరించడం సంతోషంగా ఉందని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ లతీష్ అన్నారు. వార్డులోని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సోమవారం పాత్ర ఇండియా సౌజన్యంతో రూ.2.50 లక్షల విలువ చేసే స్మార్ట్‌బోర్డును కార్పొరేటర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారంతో క్రమశిక్షణతో చదువుకుని మంచి భవిష్యత్‌ను అందుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని, వాటిని దేశంలోని రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. ఇటువంటి సంస్థలు ముందుకొచ్చి ప్రభుత్వానికి చేదోడు వాదోడుగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాత్ర ఫౌండేషన్ ఎండీ డి.లక్ష్మి ముక్కావిల్లి, పాఠశాల హెచ్‌ఎం కాంతం, పీడీ షేక్ ఇస్మాయిల్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విభాగాధిపతి దృష్టికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్ విభాగం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తాడన్న నేతృత్వంలో సోమవారం నాయకులు విభాగాధిపతి శర్మను కలిసి సమస్యలను వివరించారు. విభాగం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విభాగం గౌరవాధ్యక్షుడిగా ఎ.రవీంద్రనాథ్, సలహాదారుడిగా ఎ.బాలస్వామి, అధ్యక్షుడిగా ఎస్.వెంకటశెట్టి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా పి.అప్పారావు, బి.తిరుపతిరావును నియమించినట్టు వారు తెలిపారు. అనంతరం విభాగాధిపతికి నూతన కార్యవర్గ జాబితాను అందజేసి సత్కరించారు. నాయకులు మోహన్‌బాబు, పుల్లారావు, పైడికొండలరావు పాల్గొన్నారు.